
# పీపుల్స్ వార్‌కి పోలీస్ టెర్రర్‌కి మధ్య

# అలుపెరుగని హక్కుల పహారా



## ఎం.ఎల్. పార్టీలతో విసిగి పోయాను

## నా హక్కుల పోరాటం ఆపను : బాలగోపాల్

నిదానంగా, వినమ్రంగా, నిరాడంబరంగా, ప్రశాంతంగా వుండే పరమ సహనశీలి, సాధుజీవి బాలగోపాల్. ఆయనకి పోలీసులంటే భయంలేదు. నక్సలైట్లంటే భక్తీలేదు. ఎవరి హక్కుల కోసమైతే ఆయన ఏళ్ళతరబడి పోరాడాడో ఆ విప్లవ కారులే సామాన్య ప్రజల్ని వేధించి హింసిస్తున్నారని నిలకడమీద నిర్ధారించుకున్నారు. బాలగోపాల్ సహనానికీ హద్దుంటుంది. 'చీకటికోణాల్లో' అది కట్టలు తెంచుకుంది.

"మాటలకు అర్థం చేతిలో తుపాకీ వున్నవారు నిర్ణయిస్తారు........ ఎంత వికృతమైన మానసిక స్థితి వున్నవారు తప్పితే ఈ పని చేయగలరు ?.. విప్లవ హింస అంటే బలప్రయోగం చేసి అవసరాలు సాధించుకోవడం అనేనా ? .... విధేయతలో ఉండేదీ కోరుకునేదీ అవకాశవాదమే కదా.... అభ్యుదయం కోసం ప్రాణాలు తీసేహక్కు తమకుందని ప్రకటించుకునే వాళ్ళని బహిరంగంగానే బోనులో నిలబెట్టి ప్రశ్నించాలి" అంటూ విప్లవ కారులపై వార్ డిక్లేర్ చేశారు బాలగోపాల్. ఆయన రాసిన వాక్యాలు ఎం.ఎల్. వర్గాల్లో మందు పాతరలై పేలాయి. అడవి బిడ్డలు అదిరిపడ్డారు. సొంత చేతుల్తో ఎత్తుకు పెంచిన ఎ.పి.సి.ఎల్.సి. నుంచీ బాలగోపాల్ బైటకొచ్చారు. హ్యూమన్ రైట్స్ ఫోరం పెట్టుకున్నారు. బాధితుల పక్షం వహించడం కంటే సర్వోన్నతమైనది మరొకటి లేదని నమ్మి, మానవహక్కుల కోసం చివరిదాకా పోరాడతానని శపథం చేస్తున్న బాలగోపాల్ నిజం వైపు నిర్భయంగా నిలబడిన సాహసి. హక్కుల పోరాటం కోసం ప్రాణాధికంగా ప్రేమించే పుస్తక పఠనాన్నీ, గణిత శాస్త్రాన్నీ దూరం చేసుకున్నారు. సందు దొరికితే చాలు సంపాదించి పారేద్దాం అనే మాయదారి ఆత్రపు రోజుల్లో ఒక ఆదర్శం కోసం తెగించి నిలబడినవాడు బాలగోపాల్. ఈ మేధావి వ్యక్తిగత జీవితం గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే..........

### కుటుంబం :

" మా అమ్మ నాగమణిది కడప, నాన్న పార్థనాథ శర్మది అనంతపురం. నేను బళ్ళారిలో పుట్టాను. నాన్న ఎల్.ఐ.సి. ఉద్యోగి అయినందువల్ల బదిలీలై చాలా ఊళ్ళల్లో వున్నాం. మా అమ్మ నాన్నగారు రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ. సంగీత సాహిత్యాల్లో బాగా పేరున్నాయన. నాకు చిన్నప్పుడు విష్ణు సహస్రనామం వగైరా చెప్పాడు. అర్థం చెప్పకుండా శ్లోకాలు నేర్పించేవాడు. ఆయనకి అర్థం ముఖ్యం కాదు. శబ్దం ముఖ్యం. అర్థం అడిగితే ఇరిటేట్ అయ్యేవాడు. అయితే ఆయన లిబరల్ బ్రాహ్మిన్. చాలా కన్సిడరేట్‌గా వుండేవాడు.

పుట్టినపుడే ముగ్గురు చనిపోగా మేం ఇపుడు ఎనిమిది మందిమివున్నాం. పెద్దన్న రవీంద్రనాథ్ ఉదయ్‌పూర్, హిందుస్థాన్ జింక్ లిమిటెడ్‌లో ఆర్.అండ్.పి. మేనేజర్. రెండో అన్న కల్నల్ అనంతశయన షిల్లాంగ్‌లో ఆర్మీడాక్టర్. మూడో అన్న ఇంజనీరింగ్ చేసి మద్రాసులో ప్రైవేటు కాంట్రాక్టులు చేస్తున్నాడు. ఈ ముగ్గురి తర్వాత అక్క, కేన్సర్‌తో 1989 లో చనిపోయారు. నా తర్వాత మాధవి, మయూరి, మృణాళిని..... ఈ ముగ్గురూ హైదరాబాద్‌లో లెక్చరర్లుగా చేస్తున్నారు.

మాది మధ్యతరగతి కుటుంబం. ఎనిమిది మంది చదవడం అనేది చాలా భారం. అందరం బాగా చదువు కోవడంతో సెటిల్ అయ్యాం.

### చంద్రబాబు క్లాస్‌మేట్ :

తిరుపతిలో హైస్కూలు చదువు. 9,10,11 తరగతులు గవర్నమెంట్ స్కూల్లో. చెట్లకింద వుండడం వల్ల దాన్ని 'పార్క్ స్కూలు' అనే వారు. ఆ మూడేళ్ళూ (1966,67,68) ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నా క్లాస్‌మేటుగా వున్నారు. అప్పట్లో క్లాసుకి ఎక్కువ మంది విద్యార్థులు లేరుగనక వున్న కొద్ది మందీ సన్నిహితంగా మెలిగే వారు. కర్నూలులో కోట్ల సూర్యప్రకాశ రెడ్డి ఎన్నిక అధికార పార్టీకీ ప్రతిపక్షాలకూ ప్రతిష్టాత్మకంగా మారినపుడు ఎన్నికల తీరు పరిశీలించేందుకు మేం అక్కడికి వెళ్ళాం. అక్కడ చంద్రబాబు, తన పార్టీవారికి 'ఈయన నా క్లాస్‌మేట్' అని నన్ను పరిచయం చేశారు. 'ఎన్నికల అక్రమాలపై ఎలక్షన్ కమీషన్‌కి మీరు ఫిర్యాదు చేస్తూ పిటిషన్లు పెట్టండి. మా కంటే కూడా మీరు ఫిర్యాదు చేస్తే బాగా పట్టించుకుంటారు' అని చెప్పారు. అయితే అప్పుడు అపొజిషన్‌లో వున్న చంద్రబాబు వేరు, ఇపుడు అధికారంలో వున్న చంద్రబాబు వేరు. అది అతని తత్వం.

కావలిలో పి.యు.సి. మళ్ళీ తిరుపతిలో డిగ్రీ. వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎమ్మెస్సీ మేథ్స్, పి.హెచ్.డి, పనిలో పనిగా ఎల్.ఎల్.బి చేశాను. మేథమేటిక్స్‌లో 'థియరీ ఆఫ్ ప్రాబబులిటీ' మీద పి.హెచ్.డి. చేశాను.

### ఫ్రం రస్సెల్ టు రస్సెల్ :

తిరుపతిలో డిగ్రీక్లాసులకి ఎన్నడూ తిన్నగా వెళ్ళలేదు. ఎస్వీ యూనివర్శిటీ - లైబ్రరీలో చదువుకుంటూ వుండేవాణ్ణి. బెర్ట్రండ్ రస్సెల్ బాగా ప్రభావితం చేశారు. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ అయ్యేదాకా నేను రస్సెల్ ఫాలోయర్ని. తాత్వికంగా మార్క్సిజం తప్పనీ, సోషలిజం కరక్టనీ, సమసమాజం సరైన ఆదర్శమనీ రస్సెల్ అభిప్రాయం. 1972 నుంచి 76 వరకూ వరంగల్ కాలేజిలో చదువుకున్న రోజుల్లో నేను సోషలిస్టుని. కమ్యూనిస్టుల మీద హెగెల్ ప్రభావం బాగా వుందనీ, హెగెల్ తాత్వికభావం తప్పనీ అప్పట్లో అనుకునేవాణ్ణి.

మళ్ళీ ఇప్పుడు మార్క్సిజంలో తాత్విక లోపాలు లేదా సమస్యలున్నాయను కుంటున్నాను. ఆదర్శంగా సోషలిజమే కరెక్టని భావిస్తున్నాను. సమసమాజాన్నిచ్చే సోషలిజమే ఉన్నతమైనది.

ఈ దేశంలో కమ్యూనిస్టులకి భవిష్యత్తు వుందా? అని అడిగితే మౌలికమైన మార్పురావాలి. మార్క్సిజం యొక్క ***Fundamental Premises*** మారాల్సి వుంది.

### వరంగల్ విప్లవ కాలేజీ :

నేను ఎమ్మెస్సీ చేస్తున్నపుడు రాడికల్ విద్యార్థి ఉద్యమ నిర్మాత సూరపనేని జనార్దన్, ఇప్పటి పీపుల్స్‌వార్ సెంట్రల్ కమిటి సభ్యుడు ఉదయ్‌లు బి.టెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. అప్పుడు రీజినల్ ఇంజనీరింగ్

కాలేజీ అంటే అతి ప్రధానమైన విప్లవ కేంద్రం. అప్పుడు సోషలిస్టుగానే వున్నాను. విప్లవకారులతో 'సిద్ధాంతం తప్పు' అనేవాణ్ణి. అప్పుడే ఎమర్జెన్సీ వచ్చింది. నిషేధించిన సాహిత్య పుస్తకాలన్నీ నా గదిలో మంచంకింద వుండేవి. పుస్తకాలు చదువుకోవడం అనేది ప్రజాస్వామ్య హక్కు గనక, వాటిని నా గదిలో దాచుకోనిచ్చాను. అదెంత ప్రమాదకరమైన పనో నాకప్పుడు తెలీదు. రూం తాళం కూడా చేత్తోలాగితే వూడి వచ్చేలా వుండేది. పోలీసులకు నా మీద అనుమానం లేదు గనుక ఏమీకాలేదు. జనార్దన్, ఉదయ్‌లతో పరిచయం, మాటలు తప్ప వాళ్ళ రాజకీయాల పట్ల అప్పట్లో నాకు సింపతీ లేదు.

## ఢిల్లీకి లాల్ సలాం !

వరంగల్ కాలేజీలో పి.హెచ్.డి పూర్తిచేసి ఢిల్లీ వెళ్ళాను. 1978 నుంచి 80 దాకా రెండేళ్ళు పోస్ట్‌డాక్టొరల్, సీనియర్ రీసెర్చి ఫెలోషిప్ చేశాను. అక్కడే కమ్యూనిజం, మార్క్సిజం పట్ల పూర్తిగా కన్విన్స్ అయ్యాను. మేథమెటిషియన్‌గా కంటిన్యూ కావడం కంటే, మేథ్స్‌ని వదిలేసి, 'ఏదోఒకటి చేయాలి' అని అక్కడే నిర్ణయించుకున్నాను. దాంతో 1980 లో తిరిగి వరంగల్ వచ్చాను. సి.ఎ. చదివే వాళ్ళకి ట్యూషన్లు చెప్పాను. 1981 లో కాకతీయ యూనివర్శిటీలో మాథ్స్‌లెక్చరర్‌గా చేరాను. ఆ ఏడాదే మానవహక్కుల సంఘంలో చేరాను. 1985 వరకూ లెక్చరర్ వుద్యోగం చేశాను. 1983 లో ఖమ్మం మానవ హక్కుల సంఘం సభలో ప్రధాన కార్యదర్శిని అయ్యాను.

లెక్చరర్ ఉద్యోగమా ? పౌరహక్కుల సంఘమా ? మా హక్కుల సంఘంలో హోల్‌టైమర్ గా చేరాను. నెలకి నాకింత జీతమంటూ ఎప్పుడూ లేదు. మిగిలిన వాళ్ళంతా ఉద్యోగులు అవడం వల్ల అవసరానికి ఆదుకునేవారు. **సంస్థకి 'ఫండ్' అనేది వుండ కూడదనే అనుకునేవాణ్ణి.**

1983 లో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్‌లలో మాత్రమే పౌరహక్కుల సంఘం వుండేది. మూడునాలుగేళ్ళలో దాన్ని రాష్ట్రవ్యాప్త సంస్థగా డెవలప్ చేశాను.

మన రాష్ట్రంనుంచి, అంటే బాలగోపాల్ నుంచి ఒక్క ఫిర్యాదు వెళితే ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ రంగంలో దిగేలా పౌరహక్కుల సంఘం ప్రతిష్టని పెంచింది బాలగోపాలేనని అందరికీ తెలిసిన విషయమే. రాష్ట్రంలో ఏ మూల మానవహక్కుల ఉల్లంఘన జరిగినా అక్కడ బాలగోపాల్ వుంటాడు. ఫిర్యాదు, పత్రికా ప్రకటన, కోర్టులో పిటిషన్, పోస్ట్‌మార్టం డిమాండ్, దుర్మార్గాన్ని ఎండగట్టడం లాంటి పనులన్నీ మెరుపు వేగంతో జరిగేది హక్కుల సంఘం వల్లేనని నర్మెట్ట నుంచి న్యూఢిల్లీదాకా అందరికీ తెలుసు.

## నర్రాప్రభాకర రెడ్డి

“1991 లో వరంగల్ జిల్లా నర్మెట్ట దగ్గర ఆయన ఇంట్లోనే నర్రా ప్రభాకర రెడ్డిని పోలీసులు కాల్చి చంపారు. ప్రభాకరరెడ్డి లాయరు. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హయగ్రీవాచారి హత్యకు ప్రతీకారంగా పోలీసులు క్లయింట్స్‌లాగా వచ్చి, 'లాయరు సాబ్ వున్నారా ?' అని అడిగి లోపలికొచ్చి ఆయన్ని కాల్చేసారు. ప్రభాకరరెడ్డి అంటే నిలువెత్తు నిజాయితీ, నిష్కపటి. ఇది సరైనది అనుకున్న తర్వాత చస్తామా? బతుకుతామా? అనేది చూడకుండా ఆ పని చేసేవాడు. ఉద్యమంలో అందరూ యిలాగే వుంటారనుకుంటారు గానీ వుండరు. “చచ్చి నీ కడుపున పుడతా” అని ప్రభాకర రెడ్డి నాతో అంటుండే వారు. నా పిల్లవాడికి 'ప్రభాత్' అని ఆయన పేరే పెట్టుకున్నాను.

## అరెస్టులు - జైళ్ళు :

1985 సెప్టెంబర్ 3 న పౌరహక్కుల నేత డాక్టర్ రామనాథం గారిని పోలీసులు కాల్చిచంపారు. అప్పుడు బాలగోపాల్‌ని చంపుతాం అని నినాదాలు యిచ్చారు. పోలీస్ అధికారి ఉమేష్ చంద్రని నక్సలైట్లు చంపాక, మేం బాలగోపాల్‌ని చంపుతాం అని పోలీసులు అరిచారు. పోలీసుల కేమైనా జరిగితే పౌరహక్కుల సంఘం మీద పడేవారు. ఇద్దరు కానిస్టేబుళ్ళని నక్సలైట్స్ కిడ్నాప్ చేసినపుడు, పోలీసులు నన్ను కిడ్నాప్ చేశారు. తర్వాత కళ్ళకి గంతలు కట్టి రెండు రోజులు నిర్బంధించారు. మేం 'ప్రజాబంధు' వాళ్ళం అని చెప్పారు.



**డాక్టర్ రామనాథం గారిని పోలీసులు కాల్చిచంపారు. అప్పుడు బాలగోపాల్‌ని చంపుతాం అని నినాదాలు యిచ్చారు. పోలీస్ అధికారి ఉమేష్ చంద్రని నక్సలైట్లు చంపాక, మేం బాలగోపాల్‌ని చంపుతాం అని పోలీసులు అరిచారు... ఇద్దరు కానిస్టేబుళ్ళని నక్సలైట్స్ కిడ్నాప్ చేసినపుడు, పోలీసులు నన్ను కిడ్నాప్ చేశారు.**

“మీరూ పోలీసులే” అని నేనన్నాను. కానిస్టేబుల్స్‌ని వదిలేశాక నన్ను విడిచిపెట్టారు. యాదగిరి రెడ్డి హత్య కేసులో నన్ను అరెస్ట్ చేశారు. '85 డిసెంబర్ నుంచి '86 ఫిబ్రవరి వరకూ వరంగల్ సెంట్రల్ జైల్లో వున్నాను. ఎక్కువగా మా సభల్ని ఆపడం కోసమే నన్ను అరెస్ట్ చేసేవారు. అయితే పోలీసులు నన్నెపుడూ వేధించలేదు. తెలంగాణాలో పోలీసులు నన్ను మర్యాదగా 'డాక్టర్ సాబ్' అని పిలుస్తారు. అరెస్ట్ కావడం వల్ల ఒక్కటే యిబ్బంది. డైరీ తీసుకునేవారు. చిరునామాలూ, ఫోన్ నెంబర్లూ, ఎవరైనా సమస్య చెప్పినపుడు నోట్ చేసుకున్న పాయింట్లూ అందులో వుంటాయి. మళ్ళీ డైరీ యిచ్చేవారు కాదు. దాన్ని మళ్ళీ తయారు చేసుకోవాలంటే చాలాకాలం పట్టేది.

## మానవ హక్కుల వేదిక :

1998 సెప్టెంబర్‌లో ఏ.పి.సి.ఎల్.సి. నుంచి తప్పుకున్నాను. అక్టోబర్‌లో 'మానవ హక్కుల వేదిక' పెట్టాము. అయితే విభేదాలు 1991 నుంచీ వున్నాయి. మానవ హక్కులకు విస్తృతమైన ఎజెండా వుంది. పట్టించుకోవాల్సిన సమస్యలెన్నో వున్నాయి. అయినా ఫోకస్ మాత్రం పోరాటాలు, నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు, చిత్రహింసల పైనే వుండాలనే వాళ్ళు. విజన్ 2020, రాజీవ్ హత్యకేసు ముద్దాయిలకు శిక్ష తగ్గించడం లాంటి సమస్యలూ ఉన్నాయి. దేన్ని టేకప్ చేస్తాం ? హక్కుల ఉద్యమం ఏం చేయాలి ?

## ఎం.ఎల్. పార్టీలపై విసుగు :

అన్యాయంగా, అతిగా హింసని సామాన్య జనంపై ప్రయోగించడం తప్పని అన్నాను. ఎం.ఎల్ పార్టీలతో విభేదించడానికి ముందు ఒక ప్రాసెస్ జరిగింది. చంపడమో, కాళ్ళూ చేతులూ విరగ్గొట్టడమో చేసిన సంఘటనపై నిజనిర్ధారణ, సంబంధిత దళ నాయకులకు కబురుపెట్టడం, ఉత్తరాలు రాయడం చేశాను. నన్ను కలిసినపుడు పొరపాటే జరిగింది సవరించుకుంటాం అనేవాళ్ళు. కొన్నాళ్ళు గడిచాక మళ్ళీ యిలాగే జరిగేది. ఉత్తరాలు, నచ్చ జెప్పడం వంటి వన్నీ విఫలమై, విసుగొచ్చి ఆ వ్యాసం (చీకటి కోణాలు) రాశాను.

1989-90 వరకూ పీపుల్స్ వార్ గ్రూపు అంటే బద్ధ శత్రువులు కూడా వాళ్ళు విలువలకు నిలబడతారు అనేవారు. ఇవాళ పూర్తి అభిమానులు కూడా వీళ్ళ ఉద్యమాలు నిలబడతాయా ? అని ప్రశ్నిస్తున్నారు. అందరి అనుభవమూ యిదే.

నేను మాట్లాడుతున్నాను. వాళ్ళు మాట్లాడడం లేదంతే. అన్ని ఎం.ఎల్. పార్టీలలోనూ యిదే అనుభవం. **మీరు చాలా గొప్పవాళ్ళు, చిన్న లోపాలున్నా వెంటనే ఆఁ చిన్నవేగా అని నిర్లక్ష్యం చేస్తారు. ఇదీ మీ ప్రధాన లోపం. మీరు గొప్పవాళ్ళు అయితే కావచ్చు అని చెపితేగానీ పట్టించుకునేట్టులేరు. అందుకే లోపాల్ని ఎత్తిచూపుతూ రాశాను.**

ఉద్యమాలను condense చేయడం నా ఉద్దేశం కాదు. ఈ రోజున తెలంగాణాలో పేద రైతులు తలెత్తుకు తిరగగలుగుతున్నారంటే అది కేవలం నక్సలైట్ల వల్లనే.

## విదేశాలు వెళ్ళారా ?

లేదు. ఎప్పుడూ వెళ్ళలేదు. కాశ్మీర్ మాత్రం అయిదు సార్లు వెళ్ళాను. అక్కడి కెళితే విదేశం వెళ్ళినట్టే వుంటుంది. అక్కడి వాళ్ళు మనల్ని 'యూ ఇండియన్స్' అంటూ మాట్లాడతారు. ఎప్పుడన్నా ఇండియా నుంచి కాశ్మీర్ గనక విడిపోతే నేను విదేశం వెళ్ళినట్టే అవుతుందిగా!

**పీపుల్స్ వార్ గ్రూపు అంటే బద్ధ శత్రువులు కూడా వాళ్ళు విలువలకు నిలబడతారు అనేవారు. ఇవాళ పూర్తి అభిమానులు కూడా వీళ్ళ ఉద్యమాలు నిలబడతాయా? అని ప్రశ్నిస్తున్నారు. అందరి అనుభవమూ యిదే. నేను మాట్లాడుతున్నాను. వాళ్ళు మాట్లాడడం లేదంతే.**



## కాశ్మీర్ - నిజమైన సమస్య

కాశ్మీరీలు నాగరికులు, గొప్ప సంస్కార వంతులు. మత ఛాందసం చాలా తక్కువ. కాశ్మీరీల్లో మెజారిటీ ప్రజలు లౌకిక వాదులు. 95 శాతం మంది ముస్లింలే అయినా 1947లో వాళ్ళు ఇండియాలో వుండడమే మేలనుకున్నారు. **వాళ్ళని ముస్లింలు అనడంకంటే కాశ్మీరీలు అనడం వాస్తవానికి దగ్గరగా వుంటుంది.** పాకిస్తాన్‌లో సున్నీల మత తత్వంకంటే ప్రజాస్వామ్య భారతమే మంచిదనుకున్న కాశ్మీరీలకు ఇండియా సురక్షిత ప్రాంతం కాదని యాభైయేళ్ళ అనుభవం చెబుతోంది. కాశ్మీరీలను మనమంతా అపార్ధం చేసుకున్నాం. తమ భాషలూ, సంస్కృతీ, సంప్రదాయాలూ, అందమైన కొండప్రాంతాలపై అవ్యాజమైన ప్రేమ వారికుంది. వాటిని సంరక్షించు కోవాలన్న తాపత్రయం తప్పితే, ఇండియాలోనో, పాకిస్తాన్‌లోనో వుండాలన్న ధ్యాస వాళ్ళకు లేనే లేదు. ఇండియాతో పోరాడటానికి పాకిస్తాన్ సహకరిస్తోంది గనక, పాకిస్తాన్ ముస్లిం తీవ్రవాదుల్నే పంపిస్తుంది గనక, పోరాటానికి మద్దతు అవసరం గనక మాత్రమే కాశ్మీరీల ఛాందసవాదుల పక్షం వహిస్తున్నారు. వాస్తవానికి వాళ్ళు పూర్తిగా లౌకిక వాదులు.

## 20వ శతాబ్దపు చివరి ప్రశ్న

**సోషలిజాన్ని ఏరకంగా సాధించాలి ? అంటే 20వ శతాబ్దపు తొలినాళ్ళలో ఎలాంటి సందిగ్ధమూ లేదు. 20వ శతాబ్దపు చివరిలో మాత్రం ఏ రకంగా సాధించాలన్న ప్రశ్నకు జవాబు లేదనో, తెలీదనో అర్ధమౌతోంది. ఇప్పటికీ, ఎప్పటికీ ఆదర్శంగా కూడా సోషలిజాన్ని మించింది లేదు. అందరూ ఒకటిగా, సమానంగా వుండటం కంటే గొప్పదేముంటుంది ?**

## మార్క్స్ దాస్ కేపిటల్

పి.హెచ్.డి. చేశాక కారల్ మార్క్స్ కేపిటల్ మూడు వాల్యూంలూ చదివాను. పాశ్చాత్య తాత్విక సంప్రదాయంతో పరిచయం వుంటే కేపిటల్‌ని అర్ధంచేసుకోగలం. కేపిటల్‌ని అవగాహన చేసుకోవడం నాకు కష్టం అనిపించలేదు. చదివాక మార్క్సిజం పట్ల పూర్తిగా కన్విన్స్ అయ్యాను.

## పశ్చాత్తాపం లేనే లేదు

పదిహేనేళ్ళు పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శిగా వున్నాను. చాలా యాక్టివ్ లైఫ్, రిచ్ లైఫ్. ఇపుడు ఎలాంటి పశ్చాత్తాపమూ లేదు. నేనెంతో కొంత (ఒక్కశాతం ఐనా సరే) సమాజానికి చేయగలిగానని అనుకుంటున్నాను. మానవహక్కులలో చివరి వరకూ వుండదల్చుకున్నాను. ఉద్యమావసరాల వల్ల Book Reading effect అయిన మాట వాస్తవం. చదవలేక పోయాననే రిగ్రెట్ వుంది కొంత. మేథ్స్ మిస్సయాను.

## హిందూస్థానీ, తలత్ :

కర్నాటక సంగీతం కంటే నాకు హిందుస్థానీ ఎక్కువ యిష్టం. పాత హిందీ పాటలు బాగా నచ్చుతాయి. తలత్ మెహమూద్ పాటలంటే చాలా చాలా యిష్టం.

## నల్లకోటుతో కోర్టుకి :

హ్యూమన్ రైట్స్‌పోరాటం నడపడంతో పాటు బాలగోపాల్ యిపుడు లాయర్‌గా కోర్టుకి వెళ్తున్నారు. ఎందుకని అడిగితే, కొంత బతుకు తెరువూ, ఉద్యమానికి అవసరమయ్యే ప్రొఫెషన్ కదా అన్నారు. “ఉద్యమానికి మంచి లాయర్లు లేని లోటువుంది. ఒక్క కన్నాభిరాన్ మీద ఎంతకాలం ఆధారపడతాం ?”

కృష్ణమాదిగ 'దండోరా' పెట్టినపుడు బహుశా మొట్టమొదటి మద్దతు ప్రకటించింది మేమే. ఎస్సీల వర్గీకరణ ఎ,బి,సి,డి కావాలంటూ సదాలక్ష్మిగారి తరుపున యిపుడు కోర్టులో కేసు నేనే చూస్తున్నాను. **(ఇంటర్వ్యూ : ప్రకాష్)●**